క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండల పరిధిలోని శెట్టిగుంట, జంగిటివారిపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో నేడు గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని బుధవారం డీఈఈ భాస్కర్ రావు తెలిపారు. సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్నటువంటి, విద్యుత్ తీగలకు దగ్గరగా ఉన్న చెట్లను తొలగింపు ప్రక్రియలో భాగంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గ్యాస్ కనెక్షన్ల అందజేత


గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్న ఎంపీడీఓ దివ్య

చిన్నమండెం : మండల పరిధిలోని గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన గ్యాస్ కనెక్షన్లను ఎంపీడీఓ దివ్య అందజేశారు. బుధవారం మండల పరిధిలోని దేవగుడిపల్లె, కేశాపురం గ్రామ పంచాయతీలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

జాంబవంతుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో వెలసివున్న జాంబవంతుడి ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. జాంబవంతుడికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేసి అనంతరం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నందలూరు(రాజంపేట) : యువతకు క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని టంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శ్రీ వినాయక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నం నాగేంద్రమూర్తి, సర్పంచ్ షేక్ మైనుద్దీన్, షేక్ షావలి, ఎం.ఫణీంద్ర, షేక్ అబ్దుల్ కలామ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని పాట్టిశ్రీరాముల వీధిలో ధనుర్మాసం పురస్కరించుకొని బుధవారం రామభక్తుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహిస్తూ అయోధ్య రాములవారి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకుముందు స్థానిక రామాలయంలో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో బజన బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి క్రీడాకారుడు విజయమే లక్ష్యంగా ఆడాలి

- ఉత్సాహ భరితంగా ప్రారంభమైన ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి పోటీలు
- క్రీడాకారులను పరిచయం చేసుకున్న నాయకులు, అధికారులు


పుల్లంపేట: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


పెనగలూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కొండూరు అజయ్‌రెడ్డి


రాజంపేట టౌన్: కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సంబేపల్లె : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు నిరంతరం సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రలో భాగంగా ఎంపీపీ నాగశ్రీలక్ష్మితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్ర, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు రవీంద్రనాథ్, భాస్కర్ ఆచారి, రవి, మోహన్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

రాజంపేట టౌన్ : క్రీడాకారులు తమలో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' చక్కటి వేదిక అని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లో ఆడుదాం ఆంధ్ర పోటీలు ఉత్సాహ భరితంగా సాగుతుండటంతో సంక్రాంతి సందడి ముందే వచ్చినట్లయిందన్నారు. ప్రతి క్రీడాకారుడు విజయమే లక్ష్యంగా ఆడాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, క్రీడాపోటీల ఆర్గనైజర్ ఎస్.షామీర్‌బాషా, కౌన్సిలర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా

పుల్లంపేట : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా బుధవారం స్థానిక ఎస్‌బీవీడీ క్రీడా మైదానంలో ఏఓ హబీబుల్లా బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలు ప్రారంభించారు. మండలస్థాయిలోని 12 సచివాలయాలకు సంబంధించి 12 టీమ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో క్రీడాకారులు చురుగ్గా పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. గెలుపొందిన విజేతలను గురువారం జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఏఓ వెల్లడించారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించుటకే..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : గ్రామీణస్థాయి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుటకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. బుధవారం పెనగలూరు, చక్రంపేట హైస్కూల్ క్రీడా మైదానాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వల్ల ఎంతోమంది క్రీడాకారులు గ్రామీణస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎదుగేందుకు ఇది ఒక సువర్ణ అవకాశమని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, పీఈటీలు, మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ గుండ్లూరు శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు..


నందలూరులో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా

నందలూరు(రాజంపేట) : మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించి మంచి భవిష్యత్తు కల్పించేందుకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అరవపల్లి జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ నేతృత్వంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, వైఎస్సార్ సిపి మండల అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, నాయకులు ఆర్ముగం విశ్వనాథ్, హిమగిరినాథ్ యాదవ్, పెనుబాల నాగసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వామ్యం కావాలి

ఓబులవారిపల్లె : యువకులను సమాజసేవలో భాగస్వామ్యం చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని చిన్నఓరంపాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.దస్తగిరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నఓరంపాడు జూనియర్ కళాశాల నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ఏడవరోజు అయ్యలరాజుపల్లి హరిజనవాడలో నిర్వహించారు. హరిజనవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.దస్తగిరి మాట్లాడుతూ సమాజంలో చైతన్యం నింపి వారి నాయకత్వ లక్షణాలను వెలికితీయడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నీట్ సర్వే నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి దస్తగిరి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో పాల్గొన్న వాలంటీర్లకు యోగివేమన యూనివర్సిటీ నుండి జారీచేయబడిన సర్టిఫికెట్లను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చంద్రశేఖర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టాలి

రాజంపేట టౌన్ : భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఉద్యోగులకు వేతన సవరణ వెంటనే చేపట్టాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజంపేట బ్రాంచ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. వేతన సవరణ చేపట్టాలన్న డిమాండ్‌తో బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలోని ప్రధాన గేటు వద్ద యూనియన్ ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణ చేపట్టకపోతే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. యాజమాన్యం చర్చలకు ఆహ్వానించి, ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, జె.ప్రసాద్‌బాబు, వెంకటేశ్వర రావు, జి.చంద్రమోహన్‌రెడ్డి, వి.లక్ష్మీనారాయణ, ఆర్.కీర్తన, వి.రాఘవేంద్ర, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో వసతులు మెరుగుపరచాలి


చిట్వేలి: విచారణ చేస్తున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

నందలూరు(రాజంపేట) : మండలంలోని పోలింగ్ కేంద్రాలలో వసతులు మెరుగుపరచాలని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి స్థానిక తహసీల్దార్ వైఎస్ సత్యానందకు సూచించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 97, 98 పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెబ్ కాస్టింగ్ కోసం విద్యుత్, నీరు ఇతర సౌకర్యాలు తప్పక పోలింగ్ కేంద్రాలలో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన కృష్ణ, వీఆర్ఓ చంద్రశేఖర్ రాజు, సర్వేయర్లు చంద్రబాబు, కిరణ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణ

చిట్వేలి : పోల్లోపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పనులపై రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నివేదికను చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీషా, ఎంపీడీఓ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి


సీఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి సర్కిల్ నుంచి సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, గాలివీడు ఎస్ఐ శివకుమార్‌లు బదిలీపై వెళ్లిన సందర్భంగా బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లి సర్కిల్ పరిధిలో తక్కువ సమయంలో పనిచేసి అందరి మన్ననలు పొందారని సీఐ, ఎస్ఐలను కొనియాడారు. ఈ ప్రాంత పోలీసులు ప్రజల్లో మమేకమై సేవలు అందించాలన్నారు. మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, అప్రమత్తంగా ఉండి ఎలాంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు జీవన్ గంగనాథబాబు, రామకృష్ణారెడ్డి, తులసీరామ్, సుధాకర్ రెడ్డి, మహబూబ్ బాషా, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ విష్ణువర్ధన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్ యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల నిరసన

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ వద్ద బుధవారం హెచ్‌పీసీఎల్ ట్యాంకర్ల డ్రైవర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జీఓ నెంబర్ 106ను రద్దు చేయాలని ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా డ్రైవర్‌లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ జీఓ నెంబర్ 106 వల్ల డ్రైవర్లు, క్లీనర్‌లకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. వస్తువులనైనా వివిధ పట్టణాలకు తీసుకు వెళ్లాలంటే కచ్చితంగా రవాణా చేయడానికి డ్రైవర్‌లు అవసరమని ప్రధాని ఈ చీకటి జీఓను తీసుకురావడం వల్ల తాము చాలా నష్టపోతామన్నారు. కార్యక్రమంలో ట్యాంకర్ల డ్రైవర్‌లు, క్లీనర్‌లు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


బహుమతులు అందుకున్న విజేతలు

నందలూరు(రాజంపేట) : సంతూర్ విప్రో ఏరియా మేనేజర్ అక్బర్ బాషా ఆధ్వర్యంలో స్థానిక గొబ్బిళ్ల అక్షర స్కూల్ నందు బుధవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని రంగురంగుల ముగ్గులతో అలరించారు. అరవపల్లికి చెందిన గంగాదేవి (సఫారీ ట్రావెల్ బ్యాగ్) మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి (కిచెన్ ఎసెన్షియల్ స్టీల్ సెట్) లహరి, మూడో బహుమతి (బ్రిజ్ క్యాస్రోల్ సెట్) వెంకటసుబ్బమ్మ గెలుపొందారు. న్యాయనిర్ణేతల సూచనలతో హిమబిందు, సుహ్య, లక్ష్మీదేవి, వాణిశ్రీ, పెంచలమ్మలకు కన్సలేషన్ బహుమతులు కూడా అందించారు. రాజంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, గొబ్బిళ్ల శ్రీనాథ్, సంతూర్ ప్రతినిధుల చేతులమీదుగా విజేతలైన మహిళలకు బహుమతులు అందించారు.

రైస్ మిల్లు ప్రారంభం


మిల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : రైతులకు నాణ్యమైన సేవలు అందించి మన్ననలను పొందాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గాలివీడు – నూలివీడు మార్గంలో నాగేశ్వర రావు ఏర్పాటు చేసిన శ్రీ వినాయక మోడరన్ రైస్ మిల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సిద్దవటం : బొగ్గిడివారిపల్లి గ్రామ పంచాయతీలోని పేద ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు దాత కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి వేడుకల్లో భాగంగా బొగ్గిడివారపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకురోపల్లి, నిర్మలగిరి కాలనీ, గంగానగర్, కొమ్మనాయునిపల్లి, గ్రామాలకు చెందిన పేదలకు అందించారు.




జాతీయ స్థాయిలో రజతపతకం


రజత పతకాన్ని అందుకుంటున్న విజయ్‌కుమార్

రాజంపేట టౌన్ : పట్టణానికి చెందిన కూరాకు వినయ్‌కుమార్ తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో రజతపతకం సాధించాడు. ఈ విషయాన్ని తైక్వాండో మాస్టర్ పిచ్చయ్య విలేకరులకు తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో 37వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు జరిగినట్లు ఆయన చెప్పారు. ఈ పోటీల్లో వినయ్‌కుమార్ ప్రతిభ కనబరచి పతకాన్ని సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

మహిళలకు మాధ'వరం'!

- సంక్రాంతికి మహిళల సందడి
- వస్త్ర వ్యాపార రంగానికి కేంద్రం మాధవరం
- మగువలకు నచ్చిన చీర మాధవరం చీర


మేరువ ఈశ్వరయ్య


చేపూరి ఓబయ్య


మేరువ హరికృష్ణ

రాజంపేట/సిద్దవటం : ఒకప్పుడు అది సోమశిల ముంపుగ్రామం. ఆ గ్రామం చేనేతలకు పుట్టినిల్లు. ముంపుగ్రామంగా ఉన్నప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందింది. అప్పట్లో మాధవరం చీరలకు ఎంతో ప్రసిద్ధి. పాతమాధవరం గ్రామం చిన్నపాటి పట్టణంగా వెలుగొందింది. వైఎస్సార్ జిల్లా కడప – రేణిగుంట జాతీయ రహదారిలో ఈ గ్రామం కనిపిస్తుంది. మగువలకు నచ్చిన చీర మాధవరం చీర అనే నానిడి రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తోంది. ఇప్పుడు మాధవరం ఒక వస్త్ర వ్యాపార రంగానికి కేంద్రంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా మాధవరం చేనేతలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. దీంతో ఇక్కడ ఎప్పుడు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఇక్కడ వెలసిన హ్యాండ్‌లూమ్స్‌లలో కొనుగోలు చేసుకునేందుకు తరలివస్తుంటారు. వస్త్ర ప్రపంచం మాధవరంలో కనిపిస్తుంది. ఇప్పుడు అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. మాధవరంలో హైవే వెంబడి హ్యాండ్‌లూమ్స్ దర్శనమిస్తుంటాయి. ఉభయ జిల్లాలోని మహిళలు రాకతో మాధవరంలో సంక్రాంతి సందడి వాతవరణం నెలకొనింది. ఈ సందర్భంగా పలుగురు తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. 45 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపార రంగంలో మహిళల నమ్మకం, సహకారంతో దూసుకుపోతున్నామని శ్రీ సాయి ఈశ్వర స్కిల్స్ అధినేత మేరువ ఈశ్వరయ్య అన్నారు. అంతరాష్ట్ర వస్త్ర వ్యాపార రంగంలో అన్ని చోట్ల మా ఉత్పత్తులు ఉన్నాయని శ్రీ సాయికృష్ణ హ్యాండ్‌లూమ్స్ అధినేత చేపూరి ఓబయ్య అన్నారు. సరసమైన ధరలతో మహిళమణులకు నాణ్యత కూడిన చీరలను అందిస్తున్నామని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర హ్యాండ్‌లూమ్స్ అధినేత మేరువ హరికృష్ణ తెలిపారు.